క్లుప్తంగా

మొగుళ్లపల్లి ఎస్సైగా అశోక్



మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి ఎస్సైగా అశోక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన మాధవ్ గౌడ్ బదిలీపై ఆసిఫాబాద్ వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో రామగుండం కమిషనరేట్ పరిధిలోని ఎస్సైగా విధులు నిర్వర్తించిన అశోక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మాట్లాడుతూ.. శాంతి భద్రతల విషయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యతలు నిర్వహిస్తానని తెలిపారు. మండలంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సహకరించాలన్నారు.

టేకుమట్ల ఎస్సైగా ప్రసాద్



టేకుమట్ల: టేకుమట్ల ఎస్సైగా ప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రసాద్ వరంగల్ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తించి బదిలీల్లో ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వర్తించిన సుధాకర్ భూపాలపల్లి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

నేడు సర్వసభ్య సమావేశం

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయశ్రీ పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరవుతున్నట్లు తెలిపారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

గుడుంబాను అరికట్టాలి

ఏటూరునాగారం: రొయ్యూర్, శంకరాజుపల్లి గ్రామాల్లో గుడుంబా విక్రయాలు, తయారీ జోరుగా సాగుతుందని ఎక్సైజ్ అధికారులు స్పందించి అరికట్టాలని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డొంగిరి మధుబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుడుంబా నివారించడంలో ఎక్సైజ్ అధికారులు పూర్తిగా విఫలం అయ్యారన్నారు. గుడుంబా తయారీ, విక్రయాల వల్ల నిండు జీవితాలు కూలిపోతున్నాయని ఆరోపించారు. వెంటనే దాడులు చేపట్టి గుడుంబాను నివారించాలన్నారు.

ఆధ్యాత్మిక సమ్మేళనానికి డిగ్రీ విద్యార్థులు

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్‌లో ప్రపంచశాంతి కోసం నేడు (శుక్రవారం) నుంచి ఈ నెల 17 వరకు నిర్వహించే అంతర్జాతీయ ఆధ్యాత్మిక సమ్మేళనానికి భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి 50 మంది విద్యార్థులను తీసుకెళ్లడం జరుగుతుందని హార్ట్ ఫుల్‌నెస్ జిల్లా కోఆర్డినేటర్ రవీందర్, కోఆర్డినేటర్ మాధవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముతో పాటువివిధ దేశాల ప్రముఖులు పాల్గొననున్నారని తెలిపారు.

ఫేయిర్‌వెల్ వేడుకలు

కాటారం: తల్లిదండ్రులు, గురువుల గొప్పతనాన్ని వివరిస్తూ కాటారంలోని ఆదర్శ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఫెయిర్‌వెల్ వేడుకలు ఆకట్టుకున్నాయి. ముందస్తుగా విద్యార్థులు వారి తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంతో తల్లిదండ్రులు భావోద్వేగానికి గురయ్యారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదర్శ విద్యాసంస్థల కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, ప్రిన్సిపాల్ కృషిత, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీకాలు

రేగొండ: పశువుల్లో వస్తున్న వ్యాధుల నివారణకు ఏర్పాటు చేస్తున్న గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పశువుల యాజమానులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిని మైథిలీ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నేటి (శుక్రవారం) నుంచి నెల రోజుల పాటు కొనసాగుతుందన్నారు. టీకాలను పశువుల రక్షణకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు.

అవగాహన



వెంకటాపురం(కె): ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల హక్కులు, చట్టాలపై మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ప్రొఫెసర్ రతన్ సింగ్‌ఠాకుర్ వినిగదారుల చట్టాలు, హక్కులపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కాంగ్రెస్ పాలనతో పల్లెల అభివృద్ధి



టేకుమట్ల: పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



మొగుళ్లపల్లిలో..

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

టేకుమట్ల: కాంగ్రెస్ పాలనతోనే రాష్ట్రంలోని పల్లెలు అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని సుబ్బక్కపల్లి, సోమనపల్లి, గర్మిళ్లపల్లి, వెల్లంపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం కేవలం 90 రోజుల్లోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు కొనసాగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల, జిల్లా నాయకులు ఉన్నారు.

మొగుళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే గండ సత్యనారాయణరావు అన్నారు. గురువారం మండలంలోని మొట్లుపల్లి గ్రామంలో రూ.22.లక్షల 70వేలు, పెద్దకోమటిపల్లి గ్రామంలో రూ.25 లక్షల 75 వేలతో చెరువుల మరమ్మతుల పనులకు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జోరుక సదయ్య, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కుమారస్వామి, నాయకులు రాజు, రాము, రఫీ, రమేష్, పున్నం చందర్ రావు, రవి, మహేందర్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



గణిత దినోత్సవంలో విద్యార్థులు

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ గణిత దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో గణిత స్థిరాకం పై డే నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమలత పై లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ జీవనంలో గణితం చాలా ప్రాముఖ్యత కలిగి ఉంటుందని అన్నారు. విద్యార్థులు గణితం ఆసక్తి నేర్చుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయుడు మురళిధర్, అంగోత్ రాజు, రజిత, నర్సింహచారి, నాగేందర్, ప్రతాప అనంతరాం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రంలో వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆరోగ్య మహిళా కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 42 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. 24 మంది వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షలకు ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ క్షమాపణ చెప్పాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: ధర్మసమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్‌పై బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన అసత్య ఆరోపణలు వెనక్కి తీసుకోని బహిరంగ క్షమాపణ చెప్పాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు కొత్తూరి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం భూపాలపల్లి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో మహనీయుల ఉద్యమానికి జీవం పోసిందే విశారదన్ మహారాజ్ అన్నారు. అలాంటి వ్యక్తిపై ప్రవీణ్‌కుమార్ వ్యక్తిగతంగా, కుటుంబంపై ఆరోపణలు చేయడాన్ని ధర్మసమాజ్‌పార్టీ ఖండిస్తుందన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 48 గంటల్లో విశారదన్ మహారాజ్‌కు క్షమాపణలు చెప్పాలని లేదంటే ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. ప్రజల ముందు ప్రవీన్‌కుమార్‌ను దోషిగా నిలబెడుతామన్నారు. ఈ సందర్భంగా పార్టీ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో పార్టీ ప్రచార కమిటీ నాయకులు కందు రవి, బండారి కుమార్ మహర్షి, కృష్ణ, దశరథం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పలువురి బైండోవర్

గోవిందరావుపేట: వన్యప్రాణులను వేటాడటం కోసం విద్యుత్ తీగలు అమరుస్తున్న బుస్సాపూర్ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు కురుసం ముత్తయ్య, అరిగెల ప్రకాశ్, ఉసం శ్రీకాంత్, కందెలా నర్సయ్యలను పస్రా ఎస్సై కమలాకర్ తహసీల్దార్ సృజన్ కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బైండోవర్ చేసిన వ్యక్తులు తిరిగి మళ్లీ కరెంట్ తీగలు అమర్చితే బైండోవర్ అతిక్రమన కింద కేసు నమోదు చేసి జైల్‌కి పంపించే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.

ఫ్యాన్ల బహూకరణ



ఫ్యాన్లు బహూకరిస్తున్న డాక్టర్లు

ములుగు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు శ్రీ బాలాజీ నర్సింగ్ హోమ్ యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఫ్యాన్లను బహూకరించారు. మల్లంపల్లి పరిధిలోని 5 అంగన్‌వాడీ కేంద్రాలకు డాక్టర్ సబిత–రవిబాబులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థులు ఇబ్బందులు పడకూడదనే ఫ్యాన్లు అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, ల్యాద శ్యాంరావ్, గోల్కొండ రవి , మాచర్ల రవి, స్పెషల్ ఆఫీసర్ శ్రీదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



ఏటూరునాగారం: పరీక్షలు చేస్తున్న వైద్యురాలు



వాజేడులో..

ఏటూరునాగారం: వేసవిలో ఆరోగ్యం విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని చిన్నబోయినపల్లి పల్లె దవాఖాన వైద్యురాలు అన్మిషా అన్నారు. గురువారం మండలంలోని షాపెల్లి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. 52 మందిని పరీక్షించగా 10 మందికి జ్వరాలున్నాయి. వేసవి కాలంలో నీటిని అధికమోతాదులో తీసుకోవాలన్నారు. ఎండ సమయంలో బయటకు రాకుండా ఉండాలన్నారు. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా ఉండండి

వాజేడు: వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేరూరు వైద్యాధికారి రాహిల్ తెలిపారు. మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 25 మంది పరీక్షించి మందులను అందజేశారు. ఎక్కువగా ఒంటి నొప్పులు ఇతర సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో లక్ష్మి, జయంత్, అశ్విని, ఆశ వర్కర్లు ఉన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న ఏఎస్సై మధుసూదన్

చిట్యాల: జీవితంలో విద్యార్థి దశ కీలకం అని ఏఎస్సై మధుసూదన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాలలో ఏబీవీపీ మండల శాఖ ఆధ్వర్యంలో పరిసర ఛలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సై హాజరై మాట్లాడారు. ప్రతీ రోజు విద్యార్థులు కళాశాలకు హాజరై పాఠ్యాంశాలతో పాటు, సమాజంపై అవగాహనను పెంపొందించుకోవాలని సూచించారు. సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉంటూ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వేల్పుల రాజుకుమార్, ఉదయ్, చిరంజీవి, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్

మహాముత్తారం: జిల్లా కేంద్రంలోని కోర్టులో ఈనెల 16న లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్సై మహేందర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం పోలీస్ స్టేషన్‌ల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

కాళేశ్వరం: మున్నూరుకాపు కులస్తుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమని పలుగుల మాజీ సర్పంచ్ ఒడ్డి చంద్రయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయడం నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు. తమ కులస్తుల తరుపున సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై..

కాళేశ్వరం: పద్మశాలి కులస్తుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం శుభపరిణామం అని మహదేవపూర్ మండలం పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాచెర్ల సారయ్య గురువారం ఒక ప్రకటలో తెలిపారు. పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి సురేఖలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



ఉపాధ్యాయులతో విద్యార్థులు

రేగొండ (కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరిలోని చైతన్య భారతి పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈఓ గా ప్రేమ్‌కుమార్, ఎంఈఓగా ఐశ్వర్య, ప్రధానోపాధ్యాయురాలిగా అక్షయ, పీఈటీగా రాహుల్‌తో పాటు మనస్విని, నైని, సుదీక్ష, శరత్, వర్షిత్ ఒక్క రోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రధానోపాధ్యాయుడు పకిడే కిరణ్ కుమార్, స్వామి, నవీన్, సౌమ్య, మౌనిక విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పంపిణీ చేస్తున్న దాతలు

రేగొండ: మండలంలోని భాగిర్థిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పెండల సమ్మయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, కాంపాక్స్ బాక్స్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, రాజు, రాజయ్య, భాగ్యలక్ష్మి, అనురాద, మురళి, సాంబమూర్తి, రఘు పాల్గొన్నారు.

ఆలయ ప్రహరీ కూల్చివేత



ప్రహరీని కూల్చుతున్న సంతోష్, అరవింద్

చిట్యాల: మండలంలోని జూకల్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రహరీని గురువారం అదే గ్రామానికి చెంది పోలోజు సంతోష్, ఆయన కుమారుడు అరవింద్‌కూల్చి వేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆలయ మరమ్మతుల కోసం ఆలయ కమిటీ సభ్యులు ప్రహరీ గేట్‌ను తొలగించారు. మరమ్మతుల అనంతరం గురువారం ప్రహరీ గేట్‌ను ఏర్పాటు చేస్తున్న క్రమంలో గేట్ ముందు భాగంలో తన సొంత స్థలం ఉందని అక్కడ గేట్ ఏర్పాటు చేయొద్దంటూ ఆలయ కమిటీ సభ్యులతో సంతోష్ వాగ్వాదం చేస్తూ ప్రహరీని కూల్చి వేసినట్లు స్థానికులు తెలిపారు. కాగా, సంతోష్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రేగొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కీలకంగా పని చేసిన కురుమలపై మోసపూరిత కుట్ర జరుగుతుందని కురుమ యువ చైతన్య సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు కదారి జనార్ధన్ అన్నారు. యాదవులకు, కురుమలకు కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. అతి తక్కువ జనాభా ఉన్న కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, 40 లక్షల జనాభా ఉన్న కురుమలకు ప్రత్యేకంగా కాకుండా యాదవులతో కలిపి ఏ రాŋటు చేయడం కురుమలను మోసం చేయడమేనన్నారు. బీసీ–బీ లో ఉన్న కురుమలను, బీసీ–డీలో ఉన్న యాదవులతో కలిపి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తే కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడాతమని హెచ్చరించారు.

సోలార్ లైట్ల పంపిణీ

మహాముత్తారం: రెడ్‌కో సంస్థ సహకారంతో పాఠశాల విద్యార్థులకు డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నల్లగుంట మీనాజీపేట ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు సోలార్ లైట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుపతి, కార్యదర్శి భోజ్యానాయక్ కాంగ్రెస్ నాయకులు దుర్గయ్య, దేవేందర్‌రెడ్డి, మోత్కూరి రవి, డీటీఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహిన్, విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



రేగొండ: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ సుజాత



పలిమెల: గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివరాణి

రేగొండ: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తప్పనిసరిగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సామాల సుజాత అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గురువారం కొడవటంచ సెక్టార్‌లోని రంగయ్యపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలతో పాటు, పోషకాహార పదార్థాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. చిరుధాన్యాలతో తయారు చేసే వంటకాలు తినడం అలవాటు చేసుకోవాలని, స్థానికంగా లభించే తాజా కూరగాయలు, ఆకుకూరల్లో సైతం చాలా పోషకాలుంటాయని వివరించారు. శిశువుకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని, ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని సూచించారు. అలాగే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌పై జిల్లా కోఆర్డినేటర్ గుర్రం తిరుపతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పున్నం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ స్వరూప, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఎడ్లపల్లిలో..

మల్హర్: మండలంలోని ఎడ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ సరస్వతి మాట్లాడారు. గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న భోజనం తినాలని చెప్పారు. అలాగే పుట్టిన పాపక ముర్రుపాలు తాగించాలన్నారు. 3 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను అందురూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్లో పోషణ లోపాన్ని నివారించాలి



మల్హర్: అవగాహన కల్పిస్తున్న సరస్వతి

పలిమెల: పుట్టిన పిల్లల నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లల ఎదుగుదలకు ముఖ్యమైన పోషణ లోపాన్ని నివారించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి అంగన్‌వాడీలు, పిల్లల తల్లులకు సూచించారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మహదేవ్‌పూర్ ప్రాజెక్ట్ పరిధిలోని పలిమెల సెక్టార్‌లోని బూరుగ్గుడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ లోపం నివారణపై అవగాహన నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శివమ్మ, అయా శ్రీలత, స్కూల్ టీచర్ రవి, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక



టేకుమట్ల: జనవరి 28న నిర్వహించిన జాతీయ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మియాపురం హరీష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామీణ ప్రాంతమైన తమ పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కు ఎంపిక కావడం ఉపాధ్యాయ బృందం సమష్టి కృషి అని అన్నారు. అనంతరం ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కు ఎంపికైన రుత్విక, వ్యోం, నందకిషోర్ విద్యార్థులను అభినందించారు.